# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 50 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 11, సెప్టెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

## తెలంగాణలో మూడు నెలల్లో బిసి కులగణన

### పిటిషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్,సెప్టెంబర్10(నమస్తే ఉదయం): తెలంగాణలో కులగణన విషయం హైకోర్టుకు చేరింది. కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ రిట్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో బీసీసీ కుల గణన మూడు నెలల్లో చేపట్టాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఎర్ర సత్యనారాయణ రిట్ పిటిషన్ విచారించిన న్యాయస్థానం ఈ మేరకు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. సత్యనారాయణ తరపున నాగుల శ్రీనివాస్ యాదవ్ వాదనలు వినిపించారు. పిటిషనర్ తరపున వాదనలతో ఏకీభవించిన హైకోర్టు ప్రభుత్వానికి మూడు నెలల గడువు ఇచ్చింది. ఆ లోపు బీసీ గణన చేపట్టి నివేదిక సమర్పించాలని పేర్కొంది.







# దేశంలోనే తెలంగాణ యంగెస్ట్ స్టేట్

## ఫ్యూచర్ స్టేట్‌గా అభివృద్ధి చేస్తున్నాం

- వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం
- దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక భూమిక
- రుణాన్ని రీ స్ట్రక్చర్ చేసే అవకాశం ఇవ్వాలి
- రాష్ట్రాల పన్నుల వాటాను 41 నుంచి 50శాతానికి పెంచాలి
- 16వ ఆర్థిక సంఘం భేటీలో సీఎం రేవంత్ సూచన

హైదరాబాద్,సెప్టెంబర్10(నమస్తే ఉదయం): దేశంలోనే తెలంగాణ యంగెస్ట్ స్టేట్‌అని.. మా రాష్ట్రాన్ని ది ఫ్యూచర్ స్టేట్‌గా పిలుస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ వేగంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని పేర్కొన్నారు. మన దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ... ఆర్థికంగా తెలంగాణ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. భారీ రుణ భారం తెలంగాణకు సవాల్‌గా మారిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రుణ భారం రూ.6.85 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. ఇందులో బడ్జెట్ రుణాలతో పాటు ఆఫ్-బడ్జెట్ రుణాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత పదేళ్లలో మౌలిక ప్రాజెక్టులకు నిధుల సమీకరణకు ప్రభుత్వం భారీగా అప్పులు తీసుకుందని పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ భాగం రుణాన్ని తిరిగి చెల్లించడానికే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రుణాలు, వడ్డీ చెల్లింపులు సక్రమంగా నిర్వహించకపోతే రాష్ట్ర పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రుణాల సమస్యను పరిష్కరించేందుకు మాకు తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. రుణాన్ని రీ స్ట్రక్చర్ చేసే అవకాశం ఇవ్వాలని.. లేదా మాకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందించాలని రేవంత్ పేర్కొన్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41 శాతం నుంచి 50శాతానికి పెంచాలన్నారు. అన్ని రాష్ట్రాల తరపున ఈ డిమాండ్‌ను మీ ముందు ఉంచుతున్నామన్నారు. ఈ డిమాండ్ ను మీరు నెరవేర్చితే.. దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఎంచుకున్న లక్ష్య సాధనకు తాము సంపూర్ణంగా సహకరిస్తామన్నారు. తెలంగాణను తాము ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని రేవంత్ అన్నారు. తెలంగాణకు తగినంత సహాయం అందించాలని.. దేశాన్ని ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో మా వంతు బాధ్యతను నేరవేరుస్తామన్నారు. ఫిస్కల్ ఫెడరలిజాన్ని బలోపేతం చేయడంలో మీ మద్దతు కోరుతున్నామని తెలిపారు. తెలంగాణ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు మీ సిఫారసులు ఉపయోగపడతాయని మేం నమ్ముతున్నామని రేవంత్ పేర్కొన్నారు.

రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి సహాయం అందించాలని మిగతా.. 2లో

## దేశాభివృద్ధిలో సైబర్ సెక్యూరిటీ కీలక భూమిక

- సైబర్ నేరాలనిరోధానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక
- ఐదేళ్లలో 5 వేల సైబర్ కమాండోలకు శిక్షణ
- సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆవిర్భావోత్సవంలో అమిత్ షా

న్యూఢిల్లీ,సెప్టెంబర్10(నమస్తే ఉదయం): దేశాభివృద్ధిలో సైబర్ సెక్యూరిటీ కీలక భూమిక పోషిస్తోందని, సైబర్ క్రైమ్‌ల నిరోధానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్




నేరాలను నిరోధించేందుకు రాబోయే ఐదేళ్లలో 5 వేల సైబర్ కమాండోలకు శిక్షణ ద్వారా సిద్ధం చేసేందుకు కేంద్ర ఆలోస్తోందని చెప్పారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ మిగతా.. 2లో

## రుణాలను రీ-స్ట్రక్చరింగ్ చేయాలి

- పన్నుల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి
- గత ప్రభుత్వం అప్పులతో వడ్డీల భారం
- ఆర్థిక సంఘానికి నివేదించినట్లు భట్టి వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్10(నమస్తే ఉదయం): రాష్ట్రానికి భారంగా మారిన రుణాలను రీ-స్ట్రక్చరింగ్ చేయాలని 16వ ఆర్థిక సంఘాన్ని కోరినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘానికి చేసిన విజ్ఞప్తులను ఆయన వెల్లడించారు. కేంద్ర పన్నుల నుంచి రాష్ట్రాలకు వచ్చే ఆదాయం వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని విన్నవించినట్లు తెలిపారు. కేంద్ర పథకాలను వినియోగించు కోవాలంటే.. కఠినమైన నిబంధనలు విధిస్తున్నారని, ఫలితంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రాయోజిత పథకాలు వినియోగించు కునేలా స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ ఆర్థిక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వెంటనే సహాయం అందజేయాలని మల్లు భట్టి విక్రమార్క కోరారు. పన్నుల నుంచి రాష్ట్రానికి వచ్చే ఆదాయం వాటాను 41 శాతానికి నుంచి 50 శాతానికి కేంద్రం పెంచాలని అడిగారు. ప్రజా భవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశం మంగళవారం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల జీతాలకంటే మిత్తీలకే ఎక్కువ వెచ్చించాల్సి వస్తోందన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ రాష్ట్రానికి జీవరేఖ లాంటివని మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భరోసాలు, అధిక భద్రతను కల్పిస్తాయని వివరించారు. కేంద్ర పథకాలను వినియోగించుకోవాలంటే తరచూ రాష్ట్రాలకు కఠినమైన నిబంధనలు మిగతా.. 2లో




## నిబంధనల మేరకే గాంధీ నియామకం

- స్పీకర్ నిర్ణయాన్ని తప్పు పట్టలేం
- బిఆర్ఎస్ నేతల్లో విభేదాలకు తాము స్పందించం
- శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,సెప్టెంబర్10(నమస్తే ఉదయం): పీఏసీ చైర్మన్‌గా అరికపూడి గాంధీ నియామకాన్ని శాసనసభా వ్యవహారాశాఖ మంత్రి శ్రీధర్ బాబు సమర్థించారు. శాసనసభ నియమాల ప్రకారమే పీఏసీ ఛైర్మన్‌ను స్పీకర్ నియమించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సీఎల్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేను భారాస ఎమ్మెల్యేను అని పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ చెప్పారు. భారాస నేతలతో పీఏసీ ఛైర్మన్‌కు అభిప్రాయభేదాలు ఉంటే మాకేం సంబంధం?. ప్రభుత్వాన్ని నడపాలని ప్రజలు మాకు తీర్పు ఇచ్చారని అన్నారు. ఫలితాల తర్వాత కూడా ఏదో జరుగుతుందని భారాస నేతలు కొన్ని రోజులు తిరిగారు. అంత తిరిగిన తర్వాత కూడా ప్రజలు మరోసారి తీర్పు ఇచ్చారు. భారాస వైఖరి మారలేదని చెప్పి.. లోక్‌సభ ఎన్నికల్లో జీరో తీర్పు మిగతా.. 2లో






## మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు

- మహిళా కమిషన్ సభ్యురాలిగా ఐలమ్మ మనుమరాలు శ్వేత
- తెలంగాణలో ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగిస్తాం
- ఐలమ్మ స్ఫూర్తితో ఇందిరా గాంధీ భూ సంస్కరణలు
- చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్10(నమస్తే ఉదయం):

కోఠిలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని నిర్ణయించాం. చాకలి ఐలమ్మ మనుమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఐలమ్మ కుటుంబ సభ్యులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండాలని మా ప్రభుత్వం భావిస్తోంది.

తెలంగాణలో ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగిస్తాం. దొరల చేతుల్లో ఉన్న వేలాది ఎకరాలను పేదలకు చేరాలని ఐలమ్మ పోరాటం చేశారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఇందిరా గాంధీ భూ సంస్కరణలు తెచ్చారు. భూమి పేదవాడి ఆత్మగౌరవం..అందుకే ఇందిరమ్మ పేదలకు లక్షల ఎకరాలను పంచిపెట్టారు. ధరణి ముసుగులో కొందరు పేదల భూములను గుంజుకునే కుట్ర చేశారు. పేదల భూములను కాపాడేందుకే ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.




## ప్రతి కార్యకర్తను గుర్తించి గౌరవించే పార్టీ బిజెపి

- సభ్యత్వ నమోదు ప్రారంభించిన మెదక్ ఎంపి రఘునందన్

వికారాబాద్,సెప్టెంబర్10(నమస్తే ఉదయం): ప్రతి కార్యకర్తను గుర్తించి గౌరవించే పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమే అని ఆ పార్టీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేపీ సభ్యత్వం నమోదు కార్యక్రమానికి ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పూర్తి ప్రజాస్వామ్య బద్ధంగా పార్టీ ఎన్నికలు నిర్వహిస్తున్న ఏకైక పార్టీ కూడా బీజేపీనే మిగతా.. 2లో



## నిమజ్జనానికి తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- గతేడాది మాదిరే నిమజ్జనాలు
- నిమజ్జనం చేయకుండా నిరోధించాలని పిటిషన్
- పిటిషన్ తిరస్కరించిన హైకోర్టు
- హుస్సేన్ సాగర్ చుట్టూ కంచె ఏర్పాటు
- నిమజ్జనాలపై తొలగని సందిగ్ధత

హైదరాబాద్,సెప్టెంబర్10 (నమస్తే ఉదయం): హుస్సేన్ సాగర్‌లో వినాయక నిమజ్జనానికి తెలంగాణ హైకోర్టు మిగతా.. 2లో






## పార్టీ ఫిరాయింపులపై బిఆర్ఎస్ నీతి వాక్యాలు

- వారు మొదలు పెట్టిన పని గురించి వారే విమర్శలా
- దోచుకున్నది దాచుకోవడానికే కెటిఆర్ యూఎస్ టూర్
- మండిపడ్డ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్,సెప్టెంబర్10 (నమస్తే ఉదయం): బీఆర్ఎస్ చేస్తే సంసారం.. మేం చేస్తే వ్యభిచారమా..అంటూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన మిగతా.. 2లో

## మణిపూర్‌లో మరోమారు ఆందోళన

- ఇంటర్‌నెట్‌ను నిలిపివేసిన అధికారులు

ఇంఫాల్,సెప్టెంబర్10(నమస్తే ఉదయం): మణిపూర్‌లో డ్రోణులు, మిసైల్ దాడుల నేపథ్యంలో నిరసనలు, ఆందోళనలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అయిదు రోజుల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపి వేస్తున్నట్లు మణిపూర్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర హోం మంత్రిత్వ శాఖ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్నెట్ సేవలు తిరిగి 16వ తేదీన పునరిద్ధరిస్తామని ఆ దేశాల్లో స్పష్టం చేసింది. ఇటీవల జరిగిన డ్రోణులు, మిసైల్ దాడుల వెనుక ఉన్న వారిని వెంటనే అరెస్ట్ చేయ్యాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని ఖైరావన్‌బంద్ మహిళా మార్కెట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. మణిపూర్ ప్రాదేశికతతోపాటు పరిపాలన సమగ్రతను కాపాడాలంటూ వారంతా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డీజీపీతోపాటు రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుని తొలగించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం నిరసనకారులు ఆందోళన చేపట్టారు. అందులోభాగంగా వారంతా రాజ్‌భవన్ వైపు వెళ్లేందుకు యత్నించారు. దీంతో వారిని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద భద్రతా దళాలు నిలువరించాయి. ఆ క్రమంలో ఆందోళన కారులు, భద్రతా దళాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.



దాంతో ఆందోళనకారులపై భద్రత దళాలు టియర్ గ్యాస్ ప్రయోగించాయి. దాడులకు నిరసనగా మణిపూర్ యూనివర్శిటీ విద్యార్థులు సైతం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేశారు. విద్యార్థుల ఆందోళనలు, నిరసనల కారణంగా మధ్య తూర్పు, పశ్చిమ ఇంఫాల్ జిల్లాల్లో కర్ఫ్యూను పోలీసులు విధించారు. దాదాపు 16 నెలల క్రితం మణిపూర్‌లో రెండు తెగల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణల కారణంగా దాదాపు 200 మందికిపైగా ప్రజలు మరణించారు. అలాగే వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఆ తర్వాత పరిస్థితి సద్దుమణిగిందని భావిస్తున్న తరుణంలో సెప్టెంబర్ 6వ తేదీన మళ్లీ డ్రోణులు, మిసైల్ దాడుల్లో చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా చోటు చేసుకున్న హింసలో 8 మంది మరణించగా.. 12 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## దేశాభివృద్ధిలో సైబర్ సెక్యూరిటీ కీలక భూమిక

(మొదటి పేజీ తరువాయి)

సెంటర్ తొలి ఆవిర్భావ దినోత్సవంలో అమిత్‌షా మంగళవారంనాడు మాట్లాడుతూ, సైబర్ బేస్డ్ డాటా రిజిస్ట్రీ ఏర్పాటు, సైజర్ క్రైమ్ సమాచారం షేర్ చేసేందుకు ఒక పోర్టల్, అనుమానితులు భవిష్యత్ నేరాలకు పాల్పడకుండా నిరోధించేందుకు నేషనల్ రిజిస్ట్రీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలకు ఎల్లలు లేవని, సైబర్ సెక్యూరిటీ లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని స్పష్టం చేశారు. ప్రధాన బ్యాంకులు, ÷నాన్షియల్ ఇంటర్మేడియేటరీస్, పేమెంట్ అగ్రిగేటర్లు, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు, ఐడీ ఇంటర్మేడియేటరీస్, కేంద్ర, రాష్ట్ర లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల ప్రతినిధులతో సైబర్ ఫ్రాడ్ మిటిగేషన్ సెంటర్ (సీఎఫ్ఎంఎస్)ను ఏర్పాటు చేస్తామని అమిత్‌షా ప్రకటించారు. ఈ ఏజెన్సీలు ఆన్‌లైన్ ఆర్థిక నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా తక్షణ చర్యలకు దిగుతాయన్నారు. లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో 'సహకార సమాఖ్య'కు ఒక ఉదాహరణగా సీఎఫ్ఎంసీ సేవలందిస్తుందన్నారు. మేవాత్, జామ్‌తాఢా, అహ్మదాబాద్, హైదరాబాద్, ఛండీగఢ్, విశాఖపట్నం, గౌహతిలలో ఏర్పాటు చేసిన ఏడు జాయింట్ సైబర్ కోఆర్డినేషన్ టీమ్‌లు మంచి ఫలితాలను ఇస్తున్నట్టు అమిత్‌షా చెప్పారు. 'సైబర్ కమాండోస్' ప్రోగ్రాం కింద రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సీబీఐ వంటి సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్లకు చెందిన సుశిక్షితులతో ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. సైబర్ సెక్యూరిటీకి ఎదురవుతున్న ముప్పును ఈ టీమ్ సమర్థవంతగా ఎదుర్కొంటుందన్నారు. డిజిటల్ స్పేస్‌ను సురక్షితంగా ఉంచడంలో రాష్ట్రాలు, కేంద్ర సంస్థలకు ట్రైన్డ్ సైబర్ కమాండోలు సహకరిస్తారని చెప్పారు. ప్రపంచంలో జరిగే లావాదేవీల్లో 46 శాతం ఇండియాలోనే జరుగుతున్నందున సైబర్ ప్రపంచాన్ని సురక్షితంగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.

## ప్రతి కార్యకర్తను గుర్తించి గౌరవించే పార్టీ బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో రానున్న రోజుల్లో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్న పార్టీ బీజేపీ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికార పార్టీకి ఎన్ని సీట్లు వచ్చాయో బీజేపీకి కూడా అన్నే సీట్లు వచ్చాయన్నారు. వికారాబాద్ జిల్లా గురించి గతంలో ఉన్న నాయకులు అనేక మాటలు మాట్లాడారని.. అభివృద్ధి మాత్రం చేయలేదని విమర్శించారు. హైడ్రా గురించి మాట్లాడితే రేవంత్ రెడ్డికి సపోర్ట్ చేస్తుండని సన్నాయి నొక్కులు నొక్కుతుండ్రని మండిపడ్డారు. 'నేను ఎవరికీ వత్తాసు పలకను.... దేశం కోసం ధర్మం కోసం మాట్లాడతా' అని ఎంపీ స్పష్టం చేశారు. 'తెలుగు భాష గురించి అమెరికాలో మాట్లాడుతుంటాడు... ఈయనకు ఎలాగో మాట్లాడడంరాదు ... ఎవడు రాసిచ్చిండోనని చూస్తే శాంపిట్రోడో అనేటోడు రాసించిండు. దేశాన్ని పాలించిన తాతకు తెలియదు... ఇప్పుడున్న మానవుడికి ఈ దేశం గురించి తెలియదు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్న ప్రధాని మోడీ గురించి దేశ విచ్చినాన్ని కోరుకునే వారు రాసిస్తే రాహుల్ గాంధీ మాట్లాడుతుండు. రాహుల్ గాంధీకి పెళ్లయిందని ఓ పత్రిక రాస్తే దాన్ని కూడా తల్లి సోనియా గాంధీ ఖండించలే. రాహుల్‌పై తప్పుడు వార్తలతో నాతోటి ఎంపీ గురించి తప్పుడు ప్రచారం చేస్తుండని బీజేపీ నాయకుడు కేసు వేసిన పరిస్థితి' అంటూ రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీజేపీ గెలిస్తే నే ఈ దేశం క్షేమంగా ఉంటుందని.. అందుకోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి లోకల్ బాడీ ఎన్నికల్లో విజయం సాధించాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు.

## పార్టీ ఫిరాయింపులపై బిఆర్ఎస్ నీతి వాక్యాలు

(మొదటి పేజీ తరువాయి)

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అంశంపై శాసన సభాపతి నిర్ణయం తీసుకోవాలంటూ హైకోర్ట్ ఆదేశించిన నేపథ్యంలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన విషయంపై మాట్లాడుతూ.. నేను రూల్ ప్రకారమే ఎంపీగా పోటీచేశాను. బీఆర్ఎస్ వాళ్లు మాకు రూల్స్ చెప్తారా?. అనర్హత గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదు. ఫిరాయింపులకు శ్రీకారం చుట్టిందే కేసీఆర్ అని దానం నాగేందర్ మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హాయాంలో పీఏసీ ఛైర్మన్ బాధ్యతలు అక్బరుద్దీన్ ఒవైసీకి ఎందుకు ఇచ్చారని బీఆర్ఎస్‌ను దానం నాగేందర్ ప్రశ్నించారు. కేసీఆర్ హాయాంలో ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ ఎందుకు ఇవ్వలేదని అన్నారు. స్పీకర్ నిర్ణయం తర్వాత మా నిర్ణయం మేం చెప్తాం. బీఆర్ఎస్ నాయకులు శునకానందం పొందుతున్నారు. సరైన సమయంలో ఏం చేయాలో మాకు తెలుసు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్న వాళ్లు ఇప్పుడు మాట్లాడుతున్నారా?. రాష్ట్ర ఖజానా దోచుకున్న వాళ్లు ఇప్పుడు ఏం అర్హత ఉందని మాట్లాడుతున్నారు?. వాళ్లపై వస్తున్న ఆరోపణలు తప్పించుకునేందుకు మాపై ఆరోపణలు చేస్తున్నారు. బీఆర్ఎస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. అనర్హతకి సంబంధించి ఎక్కడ మాట్లాడాలో అక్కడే మాట్లాడుతా. దోచుకున్న డబ్బు దాచుకోవడానికి కేటీఆర్ విదేశాలకు వెళ్లారు. బీఆర్ఎస్ పార్టీలో ఓడిన వాళ్లకి విశ్వాసం లేదు. గెలిచిన వాళ్లకి విశ్వాసం లేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏం చేయాలో అర్థం కాక భయపడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఎవరు మిగలరు' అని దానం నాగేందర్ అన్నారు.

## రుణాలను రీ-స్ట్రక్చరింగ్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

విధిస్తున్నారని అన్నారు. ఫలితంగా కేంద్ర ప్రయోజిత పథకాలను పొందడంలో రాష్ట్రాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలను రూపొందించడానికి స్వయం ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం అందించాలని మంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. తెలంగాణ కీలక దశలో ఉందని.. ఆర్థికంగా, వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ. 6.85 లక్షల కోట్లకు పైగా రుణభారంతో రాష్ట్రం సతమతం అవుతోందని మంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. సెస్‌లు, సర్ చార్జీల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థూల పన్ను ఆదాయంలో రాష్ట్రాల వాటా తక్కువగా ఉందని చెప్పారు. సంక్షేమ పథకాలను బలోపేతం చేయడం కోసం మౌలిక సదుపాయాల కల్పన ద్వారా అంతరాలను పరిష్కరించడానికి అవకాశం ఉందని చెప్పారు. ఇది తెలంగాణ డిమాండ్ కాదని.. అన్ని రాష్ట్రాలకు సంబంధించినదని మంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం. రాష్ట్రానికి. తలసరి ఆదాయం ఎక్కువ ఉన్నప్పటికీ సంపద, ఆదాయంలో భారీ తేడా ఉందని అన్నారు. ఇలాంటి అసమానతల మూలంగానే రాష్ట్ర సాధన ఉద్యమం ప్రారంభమైందని చెప్పారు. సమాన తలసరి ఆదాయం పరిష్కారానికి మౌలిక సదుపాయాలు, సంక్షేమ రంగంపై గణనీయంగా ఖర్చు చేయాల్సి ఉందని మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## 2కోట్ల విరాళం అందించిన హైదరాబాద్ రేస్‌క్లబ్

**హైదరాబాద్, సెప్టెంబర్10(నమస్తే ఉదయం):**
రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు జన జీవనం స్తంభించిపోయింది. భారీ వర్షాలకు పలు చోట్ల చెట్లు, కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. పంటలు దెబ్బతిన్నాయి. ఈ వరదలకు అనేక మంది ప్రజలు ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో వరుణుడు బీభత్సం సృష్టించాడు. ఈ క్రమంలో ఖమ్మం వరద బాధితులను ఆదుకునేందుకు హైదరాబాద్ రేస్ క్లబ్ ముందుకొచ్చింది. తనవంతు సాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 2 కోట్లను విరాళంగా అందజేసింది. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రూ.2 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెకి రేస్ క్లబ్ డైరెక్టర్, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు శ్రీ రామసహాయం రఘురాంరెడ్డి, మరో డైరెక్టర్ నర్సింహా రెడ్డి అందజేశారు.

# నిబంధనల మేరకే గాంధీ నియామకం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. జీరో ఎంపీ సీట్లు ఇచ్చినా కూడా ఆ పార్టీ వైఖరి మారలేదు. రాజ్యాంగ స్ఫూర్తి గురించి మాట్లాడే నైతిక హక్కు భారాసకు లేదు. ఇప్పటికైనా భారాస నేతలు వ్యవస్థలను గౌరవించాలని శ్రీధర్‌బాబు సూచించారు. ప్రతిపక్ష నాయకుడిని పీఏసీ చైర్మన్‌గా నియమించినట్టు అర్థం చేసుకుంటున్నామన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో, రూల్ బుక్ ప్రకారమే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని భావిస్తున్నామన్నారు. స్పీకర్ నిర్ణయంలో తాము జోక్యం చేసుకోమన్నారు. స్పీకర్ విషయంలో కూడా అడ్డగోలుగా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బీఆర్ఎస్ ప్రభుత్వం కూల్చేసిందని వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం పీఏసీ చైర్మన్‌గా ఎవరిని నియమించిందో అందరికీ తెలుసన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీ సభ్యుడిని అని గాంధీ చెప్పుకున్నారని.. తాను బీఆర్ఎస్ నాయకుడిని అని గాంధీ చెప్తుంటే కాదని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారన్నారు. ఆ పార్టీ నాయకుల మధ్య సఖ్యత లేకపోతే తాము ఏం చేస్తామన్నారు. పీఏసీ చైర్మన్‌కు ఆ పార్టీ నాయకులకు ఏమైనా సమస్యలు ఉన్నాయో తమకేం తెలుసని వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను సీఎంని కలిశా అని గాంధీ చెప్పారన్నారు. పొద్దున, మాధ్యాహ్నం తేడా లేకుండా మాట్లాడేది ఇద్దరే అని... కేటీఆర్, హరీష్ తప్ప ఆ పార్టీలో మాట్లాడే నాయకులే లేరా అని ప్రశ్నించారు. అసలు బీఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. ఆ పార్టీలో ఇద్దరు తప్పా నాయకులు ఎవరూ లేరా అని నిలదీశారు. ఎమ్మెల్యే పార్టీ మార్పుపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై శ్రీధర్ బాబు స్పందిస్తూ.. 'కోర్టు పరిధిలో ఉన్న అంశాలని తాము మాట్లాడలేం కదా. కోర్టులను మేం తప్పకుండా గౌరవిస్తాం. ఏం చేయాలో హైకోర్టు చెప్పలేదు. నాలుగు వారాల్లో పక్రియ మొదలు పెట్టాలని చెప్పింది. లెజిస్లేచరి వ్యవస్థలో న్యాయ వ్యవస్థ జోక్యం ఎంత వరకు ఉంటుంది అనే అంశంపై చర్చ జరుగుతోంది.10 షెడ్యూల్ ప్రకారం ఇంత టైంలో నిర్ణయం జరగాలని చెప్పలేదని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కాగా.. అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నియమితులయ్యారు. ఆయనతో పాటు అంచనాల కమిటీకి కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డిని, ప్రభుత్వరంగ సంస్థల కమిటీకి షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్యను చైర్మన్‌లుగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ నియమించారు. తెలంగాణ శాసనసభ, శాసనమండలి బిజినెస్ రూల్స్ ప్రకారం ఈ మూడు కమిటీలకు ఎన్నికలు జరిగినట్లు అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు వెల్లడించారు. ప్రతి కమిటీకి శాసనసభ నుంచి 9 మంది, శాసనమండలి నుంచి నలుగురు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. పీఏసీకి ఎన్నికైన సభ్యుల నుంచి అరికెపూడి గాంధీని, అంచనాల కమిటీకి ఎన్నికైన సభ్యుల నుంచి నలమాద పద్మావతి రెడ్డిని, ప్రభుత్వరంగ సంస్థల కమిటీకి ఎన్నికైన సభ్యుల నుంచి కె.శంకరయ్యను ఆయా కమిటీలకు చైర్మన్లుగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ నియమించినట్లు తెలుపుతూ సోమవారం బులెటిన్ విడుదల చేశారు.

# నిమజ్జనానికి తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏటా తరహాలోనే ఈసారి కూడా హుస్సేన్ సాగర్‌లో గణెష్ నిమజ్జనాలను నిషేధించాలని మరోసారి హైకోర్టులో పిటిషన్ దాఖలైన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. దీంతో హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనాలకు ధర్మాసనం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పిటిషన్ విచారణ సందర్భంగా హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనాలు చేయవద్దని, నీరంతా కలుషితం అవుతోందని పిటిషనర్ వాదనలు వినిపించారు. నిమజ్జనాల విషయంలో గతేడాది హైకోర్టు ఇచ్చిన తీర్పునే ఈసారి కొనసాగించాలని కోర్టును అభ్యర్థించారు. అంతేకాకుండా ప్రస్తుతం కీలకంగా ఉన్న 'హైడ్రా'ను కూడా ఇందులో ప్రతివాదిగా చేర్చాలని విన్నవించారు. అయితే, పూర్తి వాదనలు విన్న తర్వాత ధర్మాసనం 'హైడ్రా'ను ప్రతివాదిగా చేర్చడానికి ఒప్పుకోలేదు. చివరి నిమిషంలో కోర్టు ధిక్కరణ పిటిషనర్ సరికాదని కోర్టు తప్పుబట్టింది. అలాగే ఆ పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. దీంతో హుస్సేన్ సాగర్‌లో వినాయక నిమజ్జనాలకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు అయింది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం మరోసారి ఆంక్షల ఉచ్చులో చిక్కుకుంది. హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జానికి క్రేన్లు ఏర్పాటు చేశామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు వెనక్కి తగ్గింది. హుస్సేన్‌సాగర్‌లో ఇప్పుడు ఎటు చూసినా ఇనుప జాలీలు కనిపిస్తున్నాయి. నిమజ్జనాలకు అనుమతి లేదనే బ్యానర్లు వాటికి కట్టారు. హుస్సేన్ సాగర్‌లో గణెశిష్ నిమజ్జనానికి అనుమతి లేదు.. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ పేర్లతో బ్యానర్లు కట్టారు. దీంతో హుస్సేన్ సాగర్లో గణెశిష్ విగ్రహాల నిమజ్జనం జరుగుతుందా..? లేదా? అనే ఉత్కంఠ కొనసాగుతోంది. మరోవైపు హుస్సేన్‌సాగర్‌లో గణపతి విగ్రహాల నిమజ్జనాలకు అనుమతి ఇవ్వకుండా గతంలో ఉన్న ఆదేశాలు అమలు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారించింది.. వినాయక నిమజ్జనం సందర్భంగా గతేడాది విగ్రహతయారీదారులు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు ఇచ్చింది. హుస్సేన్ సాగర్ సహ, హైదరాబాద్‌లోని జలవనరుల్లో ఎక్కడా విగ్రహాలు నిమజ్జనం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. గతేడాది నిమజ్జానికి నాలుగు రోజుల ముందు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలు ఈసారి అమల్లయ్యేలా చూడాలని పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు హుస్సెన్ సాగర్‌లో నిమజ్జనంపై ఆంక్షల నేపథ్యంలో భాగ్యనగర ఉత్సవ కమిటీ సభ్యులు ఏం విధంగా స్పందిస్తారనేది కూడా ఆసక్తికరంగా మారింది.. వాస్తవానికి వినాయక విగ్రహాల నిమజ్జనం వేళ సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వివిధ రకాల విగ్రహాలతో ట్యాంక్‌బండ్ వద్దకు తరలివస్తారు? ప్రతి ఏడాది గణెశిష్ నిమజ్జనం సమయానికి ఈ అంశం తెర మీదికి వస్తుంది. దీంతో హైకోర్టు సైతం ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించడం పరిపాటిగా మారింది. దానికి అనుగుణంగా బేబీ పాయింట్స్ ను ఏర్పాటు చేశామని, మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రభుత్వం వివరణ ఇస్తోంది.

# దేశంలోనే తెలంగాణ యంగెస్ట్ స్టేట్

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు. నేడు ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న 16వ ఫైనాన్స్ కమిషన్ సమావేశంలో భట్టి మాట్లాడుతూ.. పన్నుల నుంచి తెలంగాణకు వచ్చే ఆదాయం వాటాను 41శాతం నుంచి 50శాతానికి పెంచాలని కోరారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ రాష్ట్రానికి జీవరేఖ లాంటివని.. ఈ రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భరోసాలు, అధిక భద్రతను కల్పిస్తాయన్నారు. కేంద్ర పథకాలను వినియోగించుకోవాలంటే తరచూ కఠినమైన నిబంధనలు విధిస్తున్నారన్నారు. ఫలితంగా కేంద్ర ప్రాయోజిక పథకాలను పొందడంలో రాష్ట్రాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయన్నారు. రాష్ట్రాలు తమ అవసరాలు కనుగుణంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను రూపొందించడానికి స్వయం ప్రతిపత్తిని అందించాలని భట్టి కోరారు. తెలంగాణ రాష్ట్రం కీలక దశలో ఉన్నదని... వేగంగా అడుగులు వేస్తోందన్నారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 6.85 లక్షల కోట్లకు పైగా రుణపాఠంతో సతమతం అవుతున్న దన్నారు. సెస్‌లు, సర్ చార్జీల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వాలన్నారు. స్థూల పన్ను ఆదాయంలో రాష్ట్రాల వాటా తక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయడం మౌలిక సదుపాయాల కల్పన ద్వారా అంతరాలను పరిష్కరించడానికి



అవకాశం ఉందన్నారు.

ఇది తెలంగాణ డిమాండ్ కాదని.. అన్ని రాష్ట్రాలకు సంబంధించినదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమని... చారిత్రిక కారణాల వల్ల అసమాన అభివృద్ధి ఇక్కడ ఉన్నదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తలసరి ఆదాయం ఎక్కువ ఉన్నప్పటికీ సంపద, ఆదాయం మధ్య పెద్ద అంతరం ఉందని వెల్లడించారు. ఇలాంటి అసమానతల మూలంగానే రాష్ట్ర సాధన ఉద్యమం ప్రారంభమైందన్నారు. సమానతల పరిష్కారానికి మౌలిక సదుపాయాలు, సంక్షేమ రంగంపై గణనీయంగా ఖర్చు చేయాల్సి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

# పిఎసి ఛైర్మన్ పదవి గాంధీకి ఎలా ఇస్తారు..?

**నిబంధనలు తుంగలో తొక్కారు : మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నిలదీత**

**హైదరాబాద్, సెప్టెంబర్10(నమస్తే ఉదయం):**
ప్రజాపద్దుల కమిటీ పీఏసీ ఛైర్మన్ పదవి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఇవ్వడాన్ని బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఖండించారు. పీఏసీ ఛైర్మన్ పదవి ప్రతిపక్షానికి ఇచ్చే సంప్రదాయం అనాదిగా వస్తోందని ఆయన చెప్పారు. అలాంటిది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు ఏ విధంగా ఇస్తారని వేముల ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ లోపాలను ప్రతిపక్షాలు ఎత్తి చూపకూడదనే దురుద్దేశంతోనే పదవిని గాంధీకి కట్టబెట్టినట్లు మాజీ మంత్రి ఆరోపించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ప్రజాపద్దుల కమిటీ ఛైర్మన్ పదవి ఇవ్వడం రాజకీయ దుమారం రేపుతోంది. ఇప్పటికే దీన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. తమ పార్టీ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేకు ఎలా కేటాయిస్తారంటూ బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి వేముల నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..' పీఏసీ ఛైర్మన్ పదవి ప్రతిపక్షానికి ఇవ్వడం సంప్రదాయం. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరిన అరికెపూడి గాంధీకి ఆ పదవి ఇవ్వడం దుర్మార్గం. ప్రభుత్వ లోపాలు ప్రజలకు తెలియకూడదనే ప్రతిపక్షానికి పదవి ఇవ్వలేదు. ఎన్నికల విధానంలో జరగాల్సిన పీఏసీ ఏర్పాటు సెలక్షన్ ప్రాసెస్‌లో జరిగింది.

మా పార్టీ నేత హరీశ్ రావు నామినేషన్ వేస్తే తిరస్కరించారు. ఆ పదవి కోసం నాలుగు నామినేషన్లు వచ్చినా ఎన్నికలు ఎందుకు



జరగలేదు. శాసనసభ సంప్రదాయాలు తుంగలో తొక్కారు. అరికెపూడి గాంధీ.. కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం ప్రపంచమంతా చూసింది. ఆయన కాంగ్రెస్‌లో చేరిన వార్త అన్ని పత్రికల్లో వచ్చింది. పత్రికల్లో వచ్చినప్పుడు గాంధీ ఎందుకు ఖండించలేదు. పార్టీ మారిన నేతకు పీఏసీ ఇచ్చి అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని కూని చేశారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్‌ను పీఏసీ ఛైర్మన్‌గా నియమించారు. కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీలో ఒక రాజ్యాంగం తెలంగాణలో మరో రాజ్యాంగం ఉందా?. రాజ్యాంగాన్ని కాపాడుతానంటూ తిరుగుతున్న రాహుల్ గాంధీ దీనికి సమాధానం చెప్పాలని అన్నారు.. అనర్హత వేటు వేయాలని మేము ఇచ్చిన పిటిషన్ స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉంది. పెండింగ్‌లో ఉండగా ఆయనకు పదవి ఎలా ఇచ్చారు. నాకేంటి సిగ్గు అన్నట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు ఉంది.

పీఏసీలో హరీశ్ రావు ఉంటే మీకు భయమెందుకు?. గాంధీని అడ్డుపెట్టుకుని రేవంత్ రెడ్డి శిఖండి రాజకీయాలు చేస్తున్నారని అన్నారు.

## 13న ఎర్త్ టు స్పేస్ కాల్

**మాట్లాడనున్న సునీతా విలియమ్స్**

**వాషింగ్టన్, సెప్టెంబర్10(నమస్తే ఉదయం):**
బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక భూమిని చేరిన అనంతరం నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ మొదటి సారిగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడ నున్నారు. కాగా స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో సమస్య తలెత్తడంతో వారు అంతరిక్షంలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 13న ఎర్త్ టు స్పేస్ కాల్‌లో సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ మాట్లాడనున్నట్లు నాసా వర్గాలు వెల్లడించాయి. వారు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచే ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని, ఇందు కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో న్యూస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ మిషన్‌లో భాగంగా వారు ఎదుర్కొన్న సవాళ్లు, అనుభవాలను వ్యోమగాములు ప్రజలతో పంచుకుంటారని నాసా అధికారులు తెలిపారు. ఐఎస్ఎస్‌లో ఉన్న ప్రయోగశాలలో వారు చేస్తున్న శాస్త్రీయ పరిశోధనల గురించి వెల్లడించే అవకాశం



ఉన్నట్లు తెలుస్తోంది. బోయింగ్ క్రూ ఫ్లైట్ టెస్ట్‌లో భాగంగా నాసా ఈ ఏడాది జూన్‌లో ఈ ప్రయోగాత్మక పరీక్ష చేపట్టింది. 10 రోజుల మిషన్‌లో భాగంగా భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్ ఈ స్టార్‌లైనర్ వ్యోమనౌకలో జూన్ 5వ తేదీన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న సంగతి తెలిసిందే. జూన్ 14న వీరిద్దరూ భూమికి తిరుగు పయనం కావాల్సిఉండగా.. స్టార్‌లైనర్ వ్యోమనౌకలోని థ్రస్టర్లలో లోపాలు తలెత్తటంతో పాటు హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీనిని సరిచేసే క్రమంలోనే వ్యోమగాముల తిరుగు ప్రయాణం ఆలస్యమవుతూ వచ్చింది. సాంకేతిక సమస్యను పరిష్కరించిన బోయింగ్.. వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు స్టార్‌లైనర్ సురక్షితమే అని చెప్పింది. కానీ, నాసా అందుకు అంగీకరించలేదు. దీంతో స్టార్‌లైనర్ న్యూ మెక్సికోలోని వైట్ శాండ్స్ స్పేస్ హార్బర్‌లో సురక్షితంగా కిందకు దిగింది.



విఘ్నేశ్వరుడి పూజలో పాల్గొన్న అపార్ట్మెంట్ వాసులు

## దిల్‌షుక్‌నగర్ ఎస్‌జీఆర్ టవర్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

**దిల్‌షుక్‌నగర్, సెప్టెంబర్ 10 (నమస్తే ఉదయం):**
దిల్ శుక్ నగర్ పి అండ్ టి కాలనీలో గల ఎస్ జి ఆర్ టవర్స్ లో నెలకొల్పిన విగ్నేశ్వరుడికి అపార్ట్మెంట్ వాసులో ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు.

ఎస్‌జిఆర్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షులు రవి చారి ఆధ్వర్యంలో కార్యదర్శి సందీప్ కోశాధికారి నరేష్ సభ్యులు రామ్ చంద్రరావు, పద్మనాభం, శ్రీనివాస్ ,ఉమా సుందరి, హరిత, పద్మ, శ్రీ పదమ, సుప్రియలు విగ్నేశ్వరుడికి ప్రతిరోజు వివిధ పూజలు నిర్వహిస్తూ భక్తిని చాటుకుంటున్నారు.

## పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

### - మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేసిని

**కొత్త కోట, సెప్టెంబర్ 10(నమస్తే ఉదయం):** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కొత్తకోట మున్సిపల్ చైర్మన్ పొగాకు సుకేషని విశ్వేశ్వర్ అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా



కొత్తకోట మున్సిపాలిటీ పాత జూనియర్ కాలేజీ ముందు ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ నారాయణమ్మ వెంకట్ రెడ్డి ,రజక సంఘం అధ్యక్షులు బాలస్వామి, రజక సంఘం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### - రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిరణ్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10(నమస్తే ఉదయం):**
డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ మంగళవారం పోలీస్ స్టేషన్ పరిధిలో మైలర్ దేవ్ పల్లి దుర్గా నగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్యాసింజర్ ఆటోల తనిఖీల



డ్రైవర్లకు లర్నింగ్ లైసెన్స్ ఇప్పించిన ట్రాఫిక్ పోలీసులు

స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

ఈ తనిఖీలలో భాగంగా చాలామంది ఆటో డ్రైవర్లు లైసెన్స్ లేకుండా ఆటోలో నడిపిస్తున్నట్లుగా ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు.లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపిస్తున్న15 ప్యాసింజర్ ఆటోలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ సూచనల మేరకు కొంతమంది ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా లర్నింగ్ లైసెన్సులు తీసుకున్నారు.ఈ స్పెషల్ డ్రైవ్ లో ఎస్సై రాజేందర్, ఏ ఎస్ ఐ రవీందర్ రెడ్డి,కానిస్టేబుల్స్ సురేష్, చిరంజీవి, శ్రీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమావతి పేట్ పెద్ద చెరువు కబ్జాపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 9(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రేమావతి పేట్ పెద్ద చెరువును ప్రెస్టేజ్ కంపెనీ పూడ్చి అపార్ట్మెంట్‌లు, విల్లాలు నిర్మిస్తుందని ఎఫ్‌పిఎల్, బఫర్ జోన్లలో నిర్మిస్తున్న ఈ నిర్మాణాలపై రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి హైడ్రా కమిషనర్ కు ఫిర్యాదు చేశారు చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... రాజేంద్ర నగర్ మండల పరిధిలోని పెద్దచెరువు సర్వే నెంబర్స్:81,82,83,84,85,87, 88,89,90,239 లలోమొత్తం ఎఫ్‌టిఎల్‌లో ఉందని, చెరువుకు అనుకొని ఉన్న సర్వే నెంబర్స్: 41,42,43,44,65, 78,86,91,330, లలో 30 మీటర్ల వరకు బఫర్ జోన్ లోకి వస్తాయన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందించారని జైపాల్ రెడ్డి తెలిపారు . క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగిస్తామన్నారు.



వరద ముంపు నష్టాన్ని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి వివరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, చిత్రంలో మంత్రి కృష్ణారావు

## చిన్నోనిపల్లి, నాగర్ దొడ్డి ముంపు గ్రామాల ప్రజలకు అత్యవసర ఆర్థిక సహాయం అందించాలి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(నమస్తే ఉదయం):**
ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గద్వాల నియోజకవర్గంలోని చిన్నోనిపల్లి, నాగర్ దొడ్డి గ్రామాల ముంపు ప్రాంతాలు పూర్తిగా వరదనీటిలో మునిగిపోయి, వరదనీరు ఇళ్లల్లోకి చేరుకున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరికి కేటాయించిన పునరావాస కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు వీరికి అత్యవసర సహాయం క్రింద తక్షణ ఆర్థిక సాయం అందజేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ముంపు గ్రామాల సమస్యలపై మంత్రికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విన్నవించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలతో చిన్నోనిపల్లి, నాగర్ దొడ్డి ప్రాంతాలు పూర్తిగా వరదనీటితో నిండి పోయిందని, అక్కడ నివసిస్తున్న ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వీరు ఆర్ఆర్ సెంటర్లకు వెళ్లి నివసించడానికి అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే ముంపు ప్రాంతాల నుంచి ఆర్ ఆర్ సెంటర్‌కు వెళుతున్న ప్రజలకు అత్యవసర ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

దీనికి ఇరిగేషన్ మంత్రి సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.




## పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా మారనున్న సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం

- 100 శాతం సౌరశక్తి గ్రామంగా కొండారెడ్డిపల్లిని ప్రోత్సహించాలని నిర్ణయం
- ప్రక్రియను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం
- గ్రామంలో పర్యటించి ఇంటింటి సర్వే చేపట్టిన అధికారులు

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 10(నమస్తే ఉదయం):**
తెలంగాణలో పూర్తి సౌరశక్తితో నడిచే తొలి గ్రామంగా కొండారెడ్డిపల్లి రూపుదిద్దుకోనుంది. ఈ గ్రామం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం. 100 శాతం సౌరశక్తితో నడిచే ఆవాసాలకు నమూనాగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఈ గ్రామాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ప్రక్రియను ప్రారంభించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారుల బృందం మంగళవారం గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టింది.టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫరూఖీ, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, రెడ్కో వీసీ, ఎండీ అనిల్, సంస్థ డైరెక్టర్ కె.రాములు, ఇతర శాఖల ముఖ్య అధికారులు ఈరోజు కొండారెడ్డిపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో అధికారులు మాట్లాడి, ఈ పైలట్ ప్రాజెక్టు వివరాలు తెలిపారు.ఈ గ్రామంలో దాదాపు 499 గృహ వినియోగదారులు, 66 వాణిజ్య వినియోగదారులు, 867 వ్యవసాయ వినియోగదారులు, ఇతర కేటగిరిలతో కలుపుకుని మొత్తం 1,451 వినియోగదారులు ఉన్నారు. ఈ మోడల్ ప్రాజెక్ట్ అమలు చేసేందుకు నేడు ఇంటింటి సర్వేను ప్రారంభించారు. ఈ సర్వే ద్వారా గ్రామానికి అవసరమైన సౌర విద్యుత్ కెపాసిటీని అంచనా వేసి డీపీఆర్ తయారు చేసి, ఇతర ప్రక్రియలను ముందుకు తీసుకెళ్లనున్నారు.

## ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

**గద్వాల(కేటిదొడ్డి), సెప్టెంబర్10(నమస్తే ఉదయం):**
కేటిదొడ్డి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై మూడో విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అధికారిగా వ్యవహరించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 23 గ్రామాల్లో చేపట్టిన వివిధపనులపై నివేదికలను చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.4.18 కోట్లు ఖర్చు జరిగినట్లు అధికారులు తెలిపారు. సర్వే చేసిన నివేదికను సోషల్ ఆడిట్ బృందం వారు పంచాయతీ గ్రామాల వారీగా ప్రజావేదికలో చదివి వినిపించారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు, ఒకరి బదులు మరొక్కరు కూలీలు హాజరు కావడంతో వేతనాల చెల్లింపులు, మస్టర్ల హాజరు గణన లెక్కింపులో తప్పిదాలు, పని ప్రదేశం తేడాలు వంటి తప్పిదాలపై మండలంలోని 23 గ్రామాలకు గాను రూ.1,91,000 రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. మండలంలో జరిగిన ఉపాధిపనుల అవకవతవకలపై టీఏలకు, ఫీల్ట్ అసిస్టెంట్ లకు, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు అందజేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమోహన్, ఎస్ టిఎం అజయ్ కుమార్, ఏపీవో అనిల్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు,




పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## వరద బాధితుల కోసం సిఐటియు విరాళాల సేకరణ

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10(నమస్తే ఉదయం):**
సిఐటియు రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం ప్రారంభించింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జి కురుమయ్య

సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రాజేంద్రనగర్ మండల కన్వీనర్ జాజాల రుద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్మయ్య, రుద్ర కుమారులు మాట్లాడుతూ...

కార్మికులతో కలిసి కాటేదాన్ సిఐటియు ఆఫీసు నుండి కాటేదాన్ ఏరియాలో ఖమ్మం విజయవాడలో అకాల వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవడం కోసం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. కార్మికులు నిరంతరం తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం ఆగదు అదేవిధంగా దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల మీద ఎప్పటికప్పుడు అధ్యయం చేస్తూ కార్మికులు విపత్కర పరిస్థితులలో దేశాన్ని ప్రజలను కాపాడుకుంటూ ఇక్కడ ఎలాంటి ఘటనలు జరిగిన స్పందిస్తూ మానవత దృక్పథంతో ప్రతి ఒక్కరు స్పందించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కాల వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సోమల నాయక్ ,మన్యం, రవికుమార్ .కేశవులు. శేఖర్ ,కొండయ్య ,నిరంజన్,తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితుల కోసం విరాళాల సేకరణ చేపట్టిన భవన నిర్మాణ కార్మిక సంఘం




## లక్ష్మీగూడలో చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10 (నమస్తే ఉదయం):**
చాకలి ఐలమ్మ 39 వ వర్ధంతి సందర్భంగా మైలర్ దేవ్ పల్లి డివిజన్ శివాజీ చౌక్ వద్ద లక్ష్మి గుడా రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బిఆర్ఎస్ నేతలు పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత పది సంవత్సరాలుగా లక్ష్మిగూడ గ్రామంలో రజకుల కోసం దోబి ఘాట్, చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్న సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం స్పందించి లక్ష్మిగూడ రజకులకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటికీ రజకులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, లక్ష్మీగూడ రజకుల సమస్యలు పరిష్కరించకపోతే చాకలి ఐలమ్మ ను స్ఫూర్తిగా తీసుకొని పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి గూడ రజక సంఘం పాలకవర్గం సభ్యులు మహేష్, వేణు, మల్లేష్, విష్ణు, రాఘవేందర్ ,

బిఆర్ఎస్ నేతలు, లక్ష్మీగూడ రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు స్ఫూర్తిదాయకం: పుస్తకాల నర్సింగ్ రావు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10(నమస్తే ఉదయం):**
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని ఏఐటియుసి నాయకుడు పుస్తకాల నర్సింగ్ రావు కొనియాడారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బుద్వేల్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ... భూస్వాముల నుండి తన పంటలను కాపాడటం కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన దొరలను, భూస్వాములను రజాకారులను, ఎదురించిన వీర వనిత. వేలాది మందికి ధైర్యాన్ని ఇచ్చిన యోధురాలు కామ్రేడ్ చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా బుద్వేల్ చౌరస్తాలో తన చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, సిపిఐ పార్టీ ఆఫీస్ సెక్రటరీ జి.సత్యనారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



## 'కన్నప్ప' నుంచి అక్షయ్ కుమార్ ప్రీ లుక్ పోస్టర్

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రాబోతోన్న కన్నప్ప చిత్రంలో అక్షయ్ కుమార్ శివుడి పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. అక్షయ్ కుమార్ పుట్టినరోజును పురస్కరించుకుని.. అక్షయ్ కుమార్ పోషించిన శివుని పాత్రకి సంబంధించిన ప్రీ లుక్‌ను రిలీజ్ చేశారు. రుద్రాక్ష మాలతో అలంకరించబడిన చేతిని చూపించారు. ముల్లోకాలను ఏలే పరమేశ్వరుడు.. భక్తికి మాత్రం దాసుడు అంటూ శివుని తత్త్వం గురించి చెప్పే డైలాగ్ పోస్టర్ మీద పెట్టారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రంలో మోహన్ బాబు, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ వంటి భారీ తారాగణం ఉంది.



## 'దేవర' థియేట్రికల్ ట్రైలర్

మ్యాన్ ఆఫ్ మాసెస్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. అభిమానులు సహా అందరూ ఎంతో ఆతృతగా ఈ సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ ఆర్.రత్నవేలు, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు శిరిల్ వంటి స్టార్ టెక్నీషియన్స్ ఈ చిత్రానికి వర్క్ చేస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటించారు. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి విడుదలైన మూడు సాంగ్స్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం మేకర్స్ 'దేవర' మూవీని థియేట్రికల్ ట్రైలర్‌ను ముంబైలో ఘనంగా నిర్వహించారు. నిర్మాత కరణ్ జోహార్, అనిల్ తడాని సహా పలువురు ప్రముఖులు వేడుకకు హాజరయ్యారు. 2 నిమిషాల 35 సెకన్లున్న ఈ ట్రైలర్ మాస్ ఎలిమెంట్స్ ప్యాక్డ్‌గా ఉంది. ఎన్టీఆర్ అభిమానులకు, యాక్షన్ మూవీ లవర్స్ కోరుకునే అంశాలతో నిండి ఉంది. ఈ మూవీ కోసం దర్శకుడు కొరటాల శివ క్రియేట్ చేసిన ప్రత్యేకమైన ప్రపంచం, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయి. ట్రైలర్‌ను గమనిస్తే ప్రకాష్ రాజ్ గంభీరమైన వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైంది. తీరప్రాంతంలో ఎలాంటి భయాలు లేని ప్రజలు నివసిస్తుంటారు. అక్కడ ఉండే భైరా (సైఫ్ అలీఖాన్) ఓ క్రూరమైన గ్యాంగ్‌తో ఆకృత్యాలకు పాల్పడుతుంటాడు. ఇలాంటి కొంత మంది కరుడుగట్టిన గ్రామస్థులకు భయాన్ని పరిచయం చేస్తాడు 'దేవర' (ఎన్టీఆర్) . ఆ గ్రామాన్ని పెను ప్రమాదం నుంచి రక్షించే పవర్‌ఫుల్ పాత్రలో ఎన్టీఆర్ పాత్ర మనకు పరిచయం అవుతుంది.

## పొల్లాచ్చి షెడ్యూల్ పూర్తి



విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ మెషిన్ అనిల్ రావిపూడి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై నిర్మిస్తున్న ఈ మూవీ పొల్లాచ్చి షెడ్యూల్ పూర్తయింది. 30ం రోజుల లెన్తీ షెడ్యూల్‌లో, మేకర్స్ లీడ్ యాక్టర్స్ పై, పాటలు, యాక్షన్ పార్ట్‌తో కూడిన కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా, సెట్‌లోని ఛీర్ ఫుల్ ఎట్మాస్ఫియర్ చూపించే గ్లింప్స్ ద్వారా అందరికీ వినాయక చతుర్థి శుభాకాంక్షలు తెలియజేసారు. a day without laughter is a day wasted అనే చార్లీ చాప్లిన్ కోట్ సూచిస్తూ చుట్టూ చిరునవ్వులతో, నటీనటుల మధ్య ఆనందాన్ని, స్నేహాన్ని వీడియో ప్రజెంట్ చేసింది. మేకింగ్ వీడియోలో, వెంకటేష్ సంప్రదాయ దుస్తులలో కళ్లద్దాలతో కనిపిస్తుండగా, ఐశ్వర్య రాజేష్, అతని భార్య భాగ్య పాత్రలో, క్లాసిక్ చీరను ధరించింది. మీనాక్షి చౌదరి,ఎక్స్ లవ్ మీనాక్షి పాత్రలో మోడరన్ అవాతర్ లో కనిపించింది.

## అక్టోబర్ 12న 'జనక అయితే గనక'

వెర్సటైల్ యాక్టర్ సుహాస్, సంగీర్తన హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. వెర్సటైల్ యాక్టర్ సుహాస్ హీరోగా నటించారు. సందీప్ రెడ్డి బండ్ల డైరక్ట్ చేశారు. ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. దసరా సందర్భంగా 'జనక అయితే గనక' చిత్రాన్ని అక్టోబర్ 12న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇంట్రెస్టింగ్ వీడియో క్రియేట్ చేసి రిలీజ్ చేశారు. వీడియో గమనిస్తే..'జనక అయితే గనక' ఓవర్‌సీస్ హక్కులు సొంతం చేసుకున్న హీరో సుహాస్‌కి అందరూ ఫోన్ చేసి సినిమా రిలీజ్ డేట్ ఎప్పుడని అడుగుతుంటారు. వీరి గోల భరించలేక.. నిర్మాత దిల్ రాజుకి సుహాస్ ఫోన్ చేసి రిలీజ్ డేట్ గురించి అడగటం.. ఆయన దానికి మాట్లాడుతూ మన సినిమా ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే సబ్జెక్ట్ కాబట్టి దసరా సందర్భంగా అక్టోబర్ 12న 'జనక అయితే గనక' చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు తెలియజేశారు.



## 'మత్తువదలరా2' కథ ఫన్, థ్రిల్ డబుల్ వుంటుంది: శ్రీ సింహ

బ్లాక్ బస్టర్ మత్తు వదలరాకు సీక్వెల్ 'మత్తువదలరా2' ప్రేక్షకులని అలరించడానికి సిద్ధమౌతోంది. శ్రీ సింహ కోడూరి లీడ్ రోల్ లో తన సైడ్ కిక్ గా సత్య నటిస్తున్న ఈ చిత్రానికి రితేష్ రానా దర్శకత్వం వహిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా నటిస్తోంది. ప్రతిష్టాత్మక బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. సెప్టెంబర్ 13న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో శ్రీ సింహ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు. 'మత్తువదలరా2' కు చాలా బాగా ప్రిపరేషన్ జరిగింది. గెటప్పు, క్యారెక్టర్స్ స్టయిలింగ్ మారింది. 'హీ' టీం ఏజెంట్స్ గా చూపించాం. ఫస్ట్ పార్ట్ కన్నా యాక్షన్ సీన్స్ ఎక్కువగా వుంటాయి. మత్తువదలరా హిట్ అయిన తర్వాత సీక్వెల్ చేద్దామని నాకు, చెర్రీ గారికి వుండేది. డైరెక్టర్ రితిష్ లాస్ట్ ఇయర్స్ స్క్రిప్ట్ రాయడం స్టార్ట్ చేశారు. ఫస్ట్ పార్ట్ లో వున్న క్యారెక్టర్స్ ట్రావెల్ అవుతాయి. డెలివరీ బాయ్స్ నుంచి ఏజెంట్స్ ఎలా అయ్యారనే లింక్ చూపిస్తాం. సినిమా హిట్ అయ్యిందని పార్ట్ 2 తీస్తే ఖచ్చితంగా ఒత్తిడి వుంటుంది. కానీ డైరెక్టర్ రితిష్ కి ఈ కథ ఫస్ట్ పార్ట్ కి మ్యాచ్ అయ్యేలా ఆర్గానిక్ గా వచ్చింది. అందుకే నేచురల్‌గా అంతా సెట్ అయ్యింది. ఈ క్రెడిట్ అంతా డైరెక్టర్ దే. ప్రభాస్ ట్రైలర్ చాలా ఎంజాయ్ చేశారు. టీజర్ ట్రైలర్ సాంగ్ చూసి చాలా ఎక్సయిట్ అయ్యారు. ఆయనకు జెన్యూన్ గా నచ్చితేనే అంత టైం స్పెండ్ చేస్తారు. ఫస్ట్ పార్ట్ లో



ఎంతవరకూ వున్నాయో అంత వరకు లేటెస్ట్ ట్రెండ్ ప్రకారం వుంటాయి. సోషల్ మీడియాతో పరిచయం లేని ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేసే కథ, క్యారెక్టర్స్ వుంటాయి. ఫన్, థ్రిల్ డబుల్ వుంటుంది.

## 'నాన్న సూపర్ హీరో' ఫస్ట్ లుక్

నవ దళపతి సుధీర్ బాబు ఎమోషనల్ రోలర్‌కోస్టర్ రైడ్ 'మా నాన్న సూపర్‌హీరో'తో అలరించడానికి సిద్ధమౌతున్నారు. లూజర్ సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై, కామ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం దసరాకి ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేసి ప్రమోషన్స్‌ను ప్రారంభించారు.మెస్మరైజింగ్ ఫస్ట్-లుక్ పోస్టర్‌లో సుధీర్ బాబు మధ్యతరగతి కుర్రాడి అవతార్‌లో స్కూటర్‌ను నడుపుతూ, స్కూల్ పిల్లలను పలకరిస్తూ కనిపించడం డిలైట్ ఫుల్ గా వుంది. తన చిరునవ్వు పోస్టర్‌కి పర్ఫెక్ట్ టచ్ యాడ్ చేసింది.ఈ సినిమా టీజర్‌ను సెప్టెంబర్ 12న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. 'మా నాన్న సూపర్‌హీరో' మూవీ ప్రేమ, అనుబంధంకు నిజమైన అర్థాన్ని తెలుసుకుంటూ సోల్ ని కదిలించే జర్నీని ప్రారంభించిన ఫాదర్ అండ్ సన్ డ్రామా. ధీర్ బాబు సరసన ఆర్ణ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలో సాయి చంద్, సాయాజీ షిండే, రాజు సుందరం, శశాంక్, ఆమని, అన్నీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## 'వేట్టైయాన్ - ది హంటర్' నుంచి లిరికల్ సాంగ్

మెరుపై వచ్చిండే.. మడత పెట్ట వచ్చిండే.. మనసు పెట్టి వచ్చిండే.. అంటూ పక్కా మాస్ బీట్‌తో అమ్మాయి పాడే పాట వింటుంటే అందరూ



స్టెప్పులేయాలనిపిస్తోంది. ఇంతకీ అంతలా అందరినీ మడత పెట్టేలా వచ్చిందెవరో తెలుసుకోవాలంటే 'వేట్టైయాన్ - ది హంటర్' సినిమా చూసేయాల్సిం దేనంటున్నారు మేకర్స్.

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా భారీ బడ్జెట్ చిత్రాలను రూపొందిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోన్న ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్ - ది హంటర్'. 'వేట్టైయాన్ - ది హంటర్' సినిమాను ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 10న భారీ ఎత్తున విడుదల చేస్తున్నారు. టి.జె.జ్ఞానవేల్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. బ్లాక్ బస్టర్ చిత్రాలు 2.0, దర్బార్, లాల్ సలామ్ వంటి చిత్రాల తర్వాత రజినీకాంత్, లైకా ప్రొడక్షన్స్ కలయికలో రాబోతున్న నాలుగో సినిమా 'వేట్టైయాన్- ది హంటర్'. పేట, దర్బార్, జైలర్ చిత్రాలకు పుట్ స్టాపింగ్ ట్యూన్ అందించి మెప్పించిన మ్యూజిక్ డైరెక్టర్ అనిరుద్ రవిచందర్ నాలుగోసారి రజినీకాంత్ వేట్టైయాన్ సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు.

'మనసిలాయో..' అంటూ సాగే ఈ పాట వింటుంటే ఎనర్జిటిక్ బీట్‌తో సాగుతుంది. రజినీకాంత్, మంజు వారియర్ మధ్య వచ్చే పాట అని తెలుస్తుంది.


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733